నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 25 మార్చి 2025 | ADILABAD NIRMAL


## షట్టర్ తొలగింపు



షట్టర్‌ను తొలగిస్తున్న అధికారులు

నర్సాపూర్ (జీ), మార్చి 24 : మండల కేంద్రంలో ఎండీ సమీరుద్దీన్ సీసీ రోడ్డును ఆక్రమించుకుని షట్టర్ నిర్మించాడు. దీనికి సంబంధించి గ్రామ పంచాయతీ అధికారులు ఫిబ్రవరి 25, మార్చి 13, మార్చి 18వ తేదీల్లో నోటీసులు జారీ చేశారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో సోమవారం తెల్లవారు జామున ఐదు గంటలకు జేసీబీ సహాయంతో పోలీసుల సిబ్బంది సహకారంతో షట్టర్‌ను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తిరుపతి రెడ్డి, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



చేతి పంపు నీరు నింపుకుంటున్న గ్రామస్తులు

## కన్నపూర్ క'న్నీరు'

*కన్నపూర్‌లో కన్నీటి కష్టాలు మొదలయ్యాయి. ఆ ఊరిలో 62 గడపలు, 120 మంది జనాభా ఉండగా భూగర్భ జలాలు అడుగంటాయి. రోజు రావాల్సిన మిషన్ భగీరథ నీరు రెండు రోజులకోసారి వస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా నీటి ట్యాంకు నుంచి ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్ల వరకు నీరు వచ్చే మార్గంలో లీకేజీలు ఉన్నాయి. మంచినీటి పైపుల పైనే సీసీ రోడ్లు ఏర్పాటు చేయడంతో మరమ్మతులకు అవకాశం లేకుండా పోయింది. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క చేతిపంపు వద్ద నీటిని పట్టుకుంటు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోజు నీరందించేట్టు చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.*

*- ఇచ్చోడ, మార్చి 24*

## అంగన్‌వాడీల ఆందోళన

ఎదులాపురం, మార్చి 24 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. లేని పక్షంలో సమ్మెబాట పట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు శోభ, వందన, సంగీత, చాయ, లలిత, భాగ్య, గంగసాగర పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు





''అర్హులైన రైతులందరికీ ఇప్పటికే రుణమాఫీ చేశాం.. రూ. 2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతు కుటుంబాలకు రుణమాఫీ చేసేది లేదు.' అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

# రుణమాఫీకి రాం రాం!

### అర్హులకు చేశాం.. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న వారికి చేయం..

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రకటనతో రైతుల అయోమయం
- మాఫీ చేస్తుందా? లేదా? అని ఆందోళన
- సర్వేలో 18,000 మంది గుర్తింపు

ఆదిలాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ సమావేశాల్లో రుణమాఫీ విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటన రైతుల్లో ఆందోళనకు గురి చేస్తున్నది. అర్హులైన రైతులందరికీ ఇప్పటికే రుణమాఫీ చేశామని, రూ. 2 లక్షల పైగా రుణాలు ఉన్న రైతు కుటుంబాలకు రుణమాఫీ చేసేది లేదని మంత్రి ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు బ్యాంకుల్లో రూ.2 లక్షల లోపు రుణమాఫీకి అర్హులైన రైతులతో పాటు రూ.2 లక్షల పైన అప్పులు కలిగిన రైతులు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రూ. 2 లక్షల రైతు రుణమాఫీ ఆదిలాబాద్ జిల్లాలో ప్రహసనంగా మారింది. జిల్లాలో 90 వేల మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉండగా నాలుగు విడుతల్లో 62,298 మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనల వల్ల చాలా మంది రైతులు రూ.2 లక్షల రుణమాఫీకి దూరమయ్యారు. తమకు రుణమాఫీ వర్తింప చేయాలంటూ రైతుల ఆందోళన చేసిన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రేషన్‌కార్డు లేని వారు, కుటుంబాల నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డుల్లో పొరపాట్లు, బ్యాంకు ఖాతాల్లో తప్పులను సవరించడానికి సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతుల ఇండ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబాలతో సెల్ఫీలు దిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

#### ఎదురు చూపులేనా?

సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 18 వేల మంది కుటుంబ నిర్ధారణ కానట్లు గుర్తించారు. వీరితోపాటు బ్యాంకుల్లో పొరపాట్లు, ఇతర సమస్యలు ఉన్న రైతులు మరో 16వేలకు పైగా ఉన్నారు. ప్రభుత్వం గతేడాది నవంబరు 30న మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ నిర్వహించి జిల్లాలో నాలుగో విడుత జిల్లాలో 6,600 మందికి రూ.78 కోట్లు రుణమాఫీ చేసినట్లు ప్రకటించారు. రూ. 2 లక్షల బ్యాంకు అప్పులు ఉన్న రైతులు తమకు ఎప్పుడు రుణమాఫీ అవుతుందా? అని ఎదురు చూస్తున్నారు. వీరితోపాటు రూ. 2 లక్షలపైనా ఉన్న రైతులు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ వర్తింప చేయాలని కోరుతున్నారు. రుణమాఫీ సర్వే పూర్తి చేసి మూడు నెలలు దాటినా రూ.2లక్షల అర్హులకు రుణమాఫీ కాలేదు. అర్హులైన వారందరికీ ఇప్పటికే మాఫీ చేశామని మంత్రి ప్రకటన రైతుల్లో ఆందోళనకు గురి చేస్తుంది. ప్రభుత్వం మాఫీ చేస్తుందా? లేదా? ఎగ్గొడుతుందో తెలియడం లేదని రైతులు అంటున్నారు.

#### *రూ. 2 లక్షల రుణమాఫీ రైతులందరికీ అందించాలి..*

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం వద్ద స్పష్టత లేదు. రూ. 2 లక్షలపైగా ఉన్న రైతులకు రుణమాఫీ వర్తింప చేస్తామని రెవెన్యూ మంత్రి అనగా, ఇలాంటి వారికి రుణమాఫీ చేసేది లేదని వ్యవసాయశాఖ మంత్రి అంటున్నారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాపాసు పుస్తకం ఉన్న రైతులందరికీ రూ. 2 లక్షల బ్యాంకు అప్పులను ప్రభుత్వం రద్దు చేయాలి. రూ.2 లక్షల పైగా ఉన్న వారు పైన పైసలు బ్యాంకుల్లో చెల్లించాలని మంత్రుల సూచన మేరకు రైతులు అప్పులు తీసుకొచ్చి బ్యాంకుల్లో కట్టినా వారికి రుణమాఫీ కావడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో రూ.2 లక్షల రుణమాఫీ కానీ రైతులు 27,432 మంది ఉన్నారు. వీరితోపాటు రూ. 2 లక్షలు పైన ఉన్న వారికి రుణమాఫీ చేయాలి.

*- సంగె బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు*





ప్రజావాణిలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన జనం

# దరఖాస్తుల వెల్లువ

- పలు సమస్యలపై 99 అర్జీలు
- పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు

*ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ రాజర్షి షా దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలు, కొనుగోళ్లు, నీటి, విద్యుత్ సమస్యలపై 99 మంది వినతిపత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.*

*- ఆదిలాబాద్, మార్చి 24(నమస్తే తెలంగాణ)*



#### విచారణ జరపాలి..

జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ యార్డులో కూలీల నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు తెలిసిందన్నారు. నియమించిన కూలీలకు లైసెన్స్‌లు లేవని, గతంలో పనిచేసిన అనుభవం లేదన్నారు. కూలీల వద్ద నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



#### అధికంగా కొనుగోలు చేయాలి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి జొన్నలను కొనుగోలు చేయాలని తలమడుగు మండలంలోని కజ్జర్ల రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కేంద్రాల్లో మద్దతు ధరకు ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేయడం వల్ల రైతులు నష్టపోతారని, ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్కువ పంటను కొనుగోలు చేయడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోవాల్సి వస్తుందని సూచించారు.

# ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



టెలీఫోన్ ద్వారా అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 24 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ, భూ సంబంధిత, అటవీ, వ్యవసాయం, డబుల్ బెడ్రూం ఇండ్లు, పెన్షన్, రేషన్ కార్డుల వంటి దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రగతిపై సమీక్షించారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడానికి పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.

#### టెలీఫోన్ ద్వారా అర్జీలు

అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజల సహాయార్థం టెలీఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజల నుంచి ఫోన్ ద్వారా అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

#### కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

తమకు భూమి పంచనామా కాపీ ఇవ్వడంతోపాటు, తమను కులం నుంచి బహిష్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుంటాల మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన ఎ. రజనీకాంత్ దంపతులు సోమవారం నిర్మల్ ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. గ్రామంలోని 167 సర్వే నంబర్ భూమి పంచనామా కాపీని ఏడీ ఇవ్వడం లేదని తెలిపారు. తమ గ్రామంలో తమను కుల బహిష్కరణ చేసినా స్థానిక ఎస్సై చర్యలు తీసుకోవడం లేదని, తమకు ప్రాణభయం ఉందని ఫిర్యాదు చేశాడు.

#### ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం అందించాలి

-నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 24 : నిర్మల్ జిల్లాలో వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల చివరి నాటికి అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామీణ పట్టణ ప్రాంతాలలో చలివేంద్రాల ఏర్పాట్లను పూర్తి చేయాలని పౌరసరఫరా అధికారులను ఆదేశించారు.

# ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 24 : వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకే కాకుండా నీళ్లులేక ఎండిపోతున్న పంటలకు నష్ట పరిహారం అందించి ప్ర భుత్వం ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అ నిల్ కోరారు. సోమవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై గళమెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల తలమడుగు మండలంలోని కుమ్మరి లింగన్న అనే రైతు ఆరెకరాల పంట నీరులేక ఎండిపోయి చేసిన అప్పులు తీర్చలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి వడగండ్ల వానకు నష్టపోయిన వారితోపాటు పంటలు ఎండిన రైతులను కూడా దృష్టిలో ఉంచుకు పరిహారం చెల్లించాలన్నారు. పంటలు ఎండిన ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు. బోథ్ మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు చేసిందన్నారు. కానీ.. టెండర్ ప్రక్రియ పూర్తికాక వైద్య సేవలు ప్రజలు పూర్తిస్థాయిలో అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తిచేసి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. అలాగే చాలా కాలంగా ప్రజలు కోరుకుంటున్నటు వంటి జనరల్ డిగ్రీ కళాశాల లేక పోవడంతో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేక పోతున్నారని, ఇక్కడి పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వాలు గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇచ్చి సాగు చేయడానికి విద్యుత్ సరఫరాను ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల అటవీ అధికారులు కవ్వాల్ పరిధిలో విద్యుత్ లైన్లు ఉన్నాయని చెప్పి రైతుల చేలకు వేసిన లైన్లను తీసేస్తున్నారని ప్రస్తావించారు. అటవీ హక్కు పత్రాలు ప్రభుత్వాలు గిరిజన రైతులకు ఎందుకు ఇచ్చారో.. ఇప్పుడు ఎందుకు రైతుల సాగుకు ఆటంకాలు కలిగిస్తున్నారో ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన నియోజకవర్గంలో సొనాల, భీంపూర్, సిరికొండ మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు మంజూరు చేయాలని, ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

## బడ్జెట్ ప్రతులు దహనం

ఎదులాపురం, మార్చి 24 : ఎన్నికల సమయంలో దివ్యాంగులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు నగేశ్ మండిపడ్డారు. బడ్జెట్‌లో వికలాంగులకు సరైన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం బస్టాండ్ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆశన్న పాల్గొన్నారు.




బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ఎన్పీఆర్డీ నాయకులు